# తప్పెవరిది ?

'శ్రీ రామచంద్ర పరబ్రహ్మణేనమః! — అమ్మా!.. ఈ రోజు మంగళవారం... తదియ... వర్జ్యంలేదు... కాస్త ఉపాదానం వేయించు సావిత్రమ్మా!!...' నిత్యమూ చెప్పే మాటలే వల్లిస్తూ గుమ్మంముందు నిల్చున్నాడు శాస్త్రిగారు.

సావిత్రమ్మ దోసెడు బియ్యం తెచ్చి శాస్త్రిగారి ఇత్తడి చెంబులో పోసేసి "నాలుగైదు రోజులుగా బొత్తిగా రావటం లేదేం శాస్త్రిగారూ! —" పరామర్శగా అడిగింది.

అది పట్నమేమీ కాదు ఒకరినొకరు గుర్తించలేకపోయేటందుకు.

ఆ పల్లెటూళ్ళో పట్టుమని పదియిళ్ళయినా లేవు బ్రాహ్మణ కుటుంబాలు.

పైగా— అరవై య్యేళ్ళగా అదే వూళ్ళో వ్యాయవారం చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్న శాస్త్రిగారు అందరికీ చిరపరిచితుడే!.

అతనిపేద స్థితికి అంతా జాలిపడతారు! కేవలం జాలి పడటంతోనే సరిపెట్టుకోకుండా ప్రతిరోజూ సోసెడు బియ్యమో... కాస్త పప్పాదినుసులో ... కాయగూరలో ఎవరికి తోచింది వారు ఇస్తూ ఆదుకుంటున్నారు ఇన్నేళ్ళగా.

"పాపిష్టి జ్వరంతో బొత్తిగా నీరసించి పోయాను తల్లీ......" కొళ్ళు కొళ్ళుమని దగ్గుతూ జవాబిచ్చాడు శాస్త్రిగారు.

"ఇంత పెద్దవయసులో మీ కింకా ఇల్లిల్లూ తిరిగే అవస్థెందుకు చెప్పండీ?!..." అనేసి ఇంట్లోకెళ్ళి నాలుగు తోటకూర మొక్కలు తెచ్చి ఇచ్చింది సావిత్రమ్మ.

"పరమేశ్వరార్పితం" అనేసి అందుకున్నాడు శాస్త్రిగారు.

"శాస్త్రిగారు! — మా చివరి పిల్ల పెళ్ళి నిశ్చయమైంది..." సంబరపడి పోతూ చెప్పింది సావిత్రమ్మ.

"అలాగా ... చాలా సంతోషం తల్లీ..." అనేసి అక్కడే అరుగుమీద చతికిలబడిన శాస్త్రిగారు సావిత్రమ్మ పెళ్ళి వారిగురించిన వివరాలు చెప్తూ వుంటే శ్రద్ధగా ఆలకించ సాగేడు.

సావిత్రమ్మ చెప్పే ప్రతి మాటకూ శాస్త్రిగారు 'ఊఁ' కొడుతున్నాడన్న మాటేగానీ.... అతని ఆలోచన్లు మరెటో వున్నయ్.

శాస్త్రిగారి కూతురు సుశీలకూ పెళ్ళీడు వచ్చి పది పేఁనేళ్ళు దాటుతోంది.

ఆ వూళ్ళో సుశీలకంటే వయసులో చిన్న పిల్లల పెళ్ళి కూడా జరిగి పోవటం కళ్ళారా చూడగలుగుతున్నారు.

కన్నకూతురు కట్టుకునే టందుకు ఓ మంచి చీరైనా కొనిపెట్టలేని స్థితి శాస్త్రిగారిది. అలాంటిది .... పెళ్ళిచేసి అత్తవారింటికి పంపించట మంటే మాటలా అనేసి నిత్యమూ తనను తాను ప్రశ్నించుకుంటూ వుంటాడు.

లేక లేక ఒక్కగానొక్క పిల్లకలిగితే.... కన్నకూతురి అచ్చటా ముచ్చటా చూడకుండానే కన్ను మూసింది తల్లి, సుశీల పూర్తి బాధ్యత శాస్త్రిగారి చేతుల్లోనే పెట్టేసి.

సుశీల పెళ్ళి పరిష్కరించలేని సమస్యగా తయారైంది శాస్త్రిగారికి. ఆ దిగులుతో మనిషి మరింత కృంగిపోతు న్నాడు.

"అమ్మా..... సావిత్రమ్మా! — ఓ గ్లాసెడు మజ్జిగ తెచ్చి పెట్టమ్మా.... నీరసంతో కళ్ళు తిరిగితున్నట్టునిపిస్తు న్నయ్..." నోరు తెరిచి అడిగేడు శాస్త్రిగారు ఆలోచన్ల నుండి తేరుకుంటూ.

అప్పటికే సూర్యుడు నడినెత్తి మీది కొచ్చాడు. ఇక తిరిగే ఓపిక లేదనిపించింది. కానీ... చెంబు చూడబోతే సగమైనా నిండలేదు.

చేతిలో చెంబుకేసి చూచిఅసహనంగా నవ్వుకున్నాడు. ఆ నవ్వు పేలవంగానూ వుంది.

వంట్లో వోపిక వున్నా లేకపోయినా బ్రతికినన్నాళ్ళూ ఈ 'ముష్టి' బ్రతుకు తప్పదు అనే భావం ద్యోతకమైంది శాస్త్రిగారి నవ్వులో.

తాను వంటరివాడైతే తిన్నా తినక పోయినా బాధ లేదు. కానీ... పెళ్ళికి ఎదిగిన కూతురు ఇంట్లోవుంది. సుశీల కోసమైనా తాను బ్రతకాల్సి వస్తోంది.

నడుము వంగిపోయినా... తిరిగేశక్తి సన్నగిల్లినా... తిరగక తప్పటంలేదు పొట్టకూటి కోసం.

ధనంజయరావు ఆ వూళ్ళోకల్లా బాగా డబ్బున్నవ్యక్తి. మనిషి మంచివాడు! — దయార్ద్ర హృదయుడు. బీదా బిక్కికి సాయపడి ఆదుకోవటం ఆయన అలవాటు.

శాస్త్రిగారి పరిస్థితి గమనించి "ఇంకా ఎందుకొచ్చిన అవస్తయ్యా నీకు ఈ వయసులో?— పిల్లదానికెట్లాగూ పెళ్ళి చేసేశక్తి నీకు లేదు. దాన్ని మా ఇంట్లో అయినా వుంచు. మాకు వంట పనికీ ఇంటి పనికీ సాయపడుతుంది. రెండు పూటలూ కడుపునిండా తిండయినా దొరుకుతుంది అమ్మాయికి.

పై ఖర్చుకి ఓ యాభై రూపాయలిస్తాను! — ఏం? —'' అడిగేడు ధనుంజయరావు.

ఆ మాట విన్న శాస్త్రిగారి కడుపు తరుక్కుపోయి నట్టనిపించింది. కంటిల్లో నీరు తొణికిసలాడింది.

తన పరిస్థితి ఎంత హీనంగా వున్నప్పటికీ.... శాస్త్రీ కూ స్త్రో చదువుకుని... అందునా పెళ్ళీడుకెదిగిన కూతుర్ని పరాయింట్లో చాకిరీకి కుదర్చటమా? ... తాను ఎంతటి దౌర్భాగ్య స్థితిలో వున్నా అంకుమాత్రం వప్పుకోతల్చుకో లేదు శాస్త్రిగారు.

ధనుంజయరావు గారితో అలాంటి మాట అడిగించుకో వలసి వచ్చినందుకు శాస్త్రిగారి ప్రాణం విలవిల్లాడిపోయింది.

కన్నకూతురికి రెండు పూటలూ కడుపు నిండా తిండి పెట్టేశక్తి తనకులేకపోయినా.... మాసికలు వేసుకున్న బట్ట లతో తన కళ్ళఎదుట తిరుగుతున్నా సహించాను. కానీ... పరాయి ఇంట పనికి కుదిర్చేటందుకు మాత్రం మనస్కరించ లేదు.

ఆలోచనల్లనుంచి తేరుకున్న శాస్త్రిగారు సావిత్రమ్మ దగ్గర శలవుతీసుకుని కూర్చున్నవాడల్లా లేచి బయల్దేరేడు.

భుజంమీదున్న కండువా నెత్తిమీద వేసుకుని కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

సుశీల వాకిట్లోనే ఎదురై "నాన్నా! – బాబాయొ చ్చాడు" అనేసి చెప్పింది. తండ్రి చేతిలో చెంబు తోటకూర మొక్కలూ అందుకుంది.

ఇంట్లోకొచ్చాడు శాస్త్రిగారు.

అది పెంకుటిల్లేమీ కాదు! కేవలం పూరిల్లు!! అదీ స్వంతం కాదు —

కరణంగారు దయతల్చి ఆయన గారి స్థలంలో ఆయన ఖర్చుతోటే మట్టి గోడలతో పూరిపాకలాంటిది వేయించి ఇచ్చాడు.

అందులోనే కొన్నేళ్ళుగా తలదాచుకుంటున్నాడు శాస్త్రిగారు.

*　　*　　*　　*

భోజనాలైన తర్వాత శాస్త్రిగారు తమ్ముడితో కబుర్లలోకి దిగేడు.

"అన్నయ్యా–నాకు తహసీల్దారు ప్రమోషనొచ్చింది" సంతోషంగా చెప్పేడు గంగాధరం.

"పోనీలేరా... నువ్వూ నీ పిల్లలూ అదృష్టవంతులు... ఏమిటి చాలా కాలానికి వెతుక్కుంటూ వచ్చావ్? —" మామూలు ధోరణిలో అడిగేడు.

"నువ్వెలా వున్నావో ఏమిటో చూచిపోదామన్పించింది" అన్నాడేగానీ చల్లకొచ్చి ముంత దాచటం ఇష్టంలేని

గంగాధరం సుశీలను నా వెంట తీసుకెళ్ళదల్చుకున్నాను. . . ''
అంటూ అన్నగారి ముఖంలోకి చూశాడు.

"అమ్మాయిని తీసుకెడతావా? – దేనికీ – నీ సంతానం నీకు కాక. . .'' అర్థోక్తిలో ఆగిపోయాడు.

"నీ ఇబ్బంది కళ్ళారా చూస్తూ ఆమాత్రమైనా నేను సాయపడలేకపోతే ఎందుకన్నయ్యా.... నాదగ్గరే వుంచుకుని సుశీలకు టైపూ షార్ట్‌హేండ్‌ట్దైనా నేర్పిస్తాను. ఆ తర్వాత కనీసం వుద్యోగ మేదైనా సంపాదించుకుని తన బాధ్యత తానే చూసుకోగలుగుతుంది. ఏమంటావ్ అన్నయ్యా?—''

తమ్ముడు చదువుకున్నవాడు. పైగా వుద్యోగం చేస్తున్నవాడు ... ఆ కారణంగా అతని సలహా కూడా బాగానే వున్న దన్పించక పోలేదు.

కానీ ..... తనకింత వేళకు వుడకేసి పెట్టే మనిషి సాయం కూడా కరువౌతుంది.

అయినా సరే సుశీల భవిష్యత్తే ముఖ్యంగా తోచింది శాస్త్రిగారికి.

సుశీలను కూడా అడిగి అభిప్రాయం తెల్సుకుందామన్పించటంతో... ప్రక్కనే కూర్చుని చేటలో పోసుకున్న బియ్యంలో రాళ్ళు ఏరుతున్న కూతురి ముఖంలోకి చూస్తూ "మీ బాబాయి నిర్ణయం విన్నావుగా! — నువ్వేమంటావ్ సుశీలా? — '' అడిగేడు శాస్త్రిగారు.

వయసు మళ్ళిన తండ్రిని వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళాలనిపించలేదు సుశీలకు. మరోవైపు...... బాబాయి వెంట వెళ్ళి చదువు కోవాలనీ వుంది. ఎటూ తేల్చి చెప్పలేని అయోమయ స్థితిలో మౌనంగా వుండి పోయింది.

"అదేమిటన్నయ్యా ... నువ్వు పంపిస్తానంటే.. సుశీల మాత్రం రానంటుందా!!..." గంగాధరం అనేశాడు.

"ఒరే అబ్బీ! — దాని అదృష్టానికి నేను అడ్డు పడ దల్చు కోలేదురా! — నేనెట్లాగూ దాని బ్రతుకొక్క మార్గం చూపించలేక పోతున్నాను. అలాంటిది నువ్వు సాయ పడతావంటే వద్దనేటందుకు మనసు రావటంలేదు...." అనే శాడు శాస్త్రిగారు.

*　　*　　*　　*

పిన్నిగారింటికి వచ్చినప్పటినుంచీ ఒంటరితనం దూర మైంది సుశీలకి.

చేదోడు వాదోడుగా పిన్నితోపాటు ఇంటిపన్లు చేయ టం.... మిగతా సమయాల్లో ఇంట్లో పిల్లలతో కబుర్లు!

కేంపులనేసి నెలకు ఇరవై రోజులు గంగాధరం ఇంటి పట్టునే వుండడు.

ఆ కారణంగా తన సంగతేమిటనేసి అడిగే అవకాశం దొరక్కుండా వుంది సుశీలకు. పైగా ... ఒకవేళ సమయం

చిక్కినా తనుగా అడిగే ధైర్యం సుశీలలో లేదు. అడిగితే ఏమైనా అనుకుంటాడేమోనే జంకూ వుంది.

అప్పుడే సుశీల వచ్చేసి ఆరునెలలు కావస్తోంది.

వచ్చిన కొత్తల్లో ఇంటి పన్లు చేయటం సరదాగా వున్నదనిపించేది — కానీ... తానొచ్చిన పది రోజులైనా కాకుండానే పని మనిషిని మాన్పించేసింది పిన్ని. అంట్లగిన్నెలు తోమటం దగ్గర్నుంచీ... బట్టలు వుతకటం ఇంటిల్లిపాదికీ వండిపెట్టటం వరకూ అన్ని పన్లూ సుశీల నెత్తిమీదే పడ్డది.

అయినా... పరాయి ఇల్లు కాకపోవటంతో మనసుకు బాధనిపించటం లేదు.

వేళకు రెండు పూటలూ కడుపునిండా భోజనం.... మధ్యాహ్నంపూట అందరితోపాటు తనకూ టిఫినూ అమురుతూనే వుంది.

కానీ... వంటరి సమయంలో తండ్రి గుర్తొచ్చేవాడు.

ఇంటెడి చాకిరీ చేస్తూ చిన్నాయన గారింట్లో వుండే కంటే... తండ్రి దగ్గరే వుంటే తన చేతుల మీదుగా ఇంత వండి పెట్టగలిగి వుండేది. తండ్రి ఆలనా పాలనా చూడగలిగేది సుశీల. తండ్రి లేచినా లేవలేకపోయినా సహాయపడగలిగేది.

కానీ.... ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా పోయింది.

ఒక రోజు రాత్రి......

పిల్లలూ, సుశీలా హాల్లో పడుకున్నారు!

పక్కనే వున్న బెడ్ రూములో గంగాధరం దమయంతీ కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"సుశీల వచ్చి ఇన్నాళ్ళయినా దాని విషయమేమీ పట్టించుకోకపోతే అదేమైనా అనుకోదూ? — దమయంతి భర్తతో హెచ్చరించింది.

"ఆఫీసు పన్లతో ఒక్క క్షణం వూపిరాడకుండా చస్తున్నాను. మధ్యలో నీ గొడవేమిటే..." జవాబిచ్చాడు గంగాధరం.

"నిమ్మకు నీరెత్తినట్టు మీమటుక్కు మీరు మాట్లాడకుండా వుంటే ఏం బావుంటుంది? — " సంభాషణ పొడిగించింది దమయంతి.

" అసలు మనిషి అది మాట్లాడకుండా వుంటే... మధ్యలో నీ కెందుకొచ్చిన తలనొప్పి చెప్పూ?! — " విసుగు ధ్వనించింది గంగాధరం మాటల్లో.

" ఉరుము వురిమి మంగలం మీద పడట్టు ... మధ్య నామీద విరుచుకుపడతారేం? కనీసం టైపు నేర్చుకునేటందుకైనా సుశీలను పంపించటం లేదని తెలిస్తే మీ అన్నగారు బాధపడరూ? — "

"ఏడిసినట్లేవుంది నీ తెలివి! దాన్ని వుద్ధరించేటందుకా ఇంట్లోకి తీసుకొచ్చి పెట్టుకుందీ?— చాకిరీ చేయటానికి ఇంట్లోకి మనిషి కావాలిగదాని తీసుకొచ్చుకున్నాం - అంతగా కావా లనేసి అది నోరు తెరిచి అడిగితే అప్పుడు ఆలోచిద్దాంలే! - కాసిని మంచి నీళ్ళిచ్చి నువ్వు పడుకో... పొద్దుపోయి నట్టుంది .." అనేసి తన ఆంతర్యాన్ని బహిర్గతం చేశాడు భార్యతో.

సుశీల పక్క మీద పడుకున్నదన్న మాటేగాని నిద్ర పోవటం లేదు. వాళ్ళ సంభాషణ విని బాధపడ్డది.

ఇందుకా బాబాయి తనను అంత ప్రేమగా ఇంతదూరం తీసుకొచ్చిందీ అని వాపోయింది సుశీల.

పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ మనసు లోనే ఎన్నో విధాలుగా మదనపడ సాగింది.

* * * *

రోజులూ... దొర్లిపోతున్నయ్.

సుశీల అడగ్గా అడగ్గా ఒక శుభముహూర్తాన టైపు ఇన్స్టిట్యూట్లో చేర్పించాడు గంగాధరం.

ఆల్ఫ బెట్సు నేర్చుకుంటున్నప్పుడు విసుగు అన్పిం చినా... తర్వాత తర్వాత పాసేజస్ వచ్చేటప్పటికి స్పీడు ఇంప్రూ కావటంతో టైపు చేయటం సరదాగానే వున్న దన్పించింది.

"అమ్మాయ్ సుశీలా! ఈ రోజు షైపుకి వెళ్ళద్దులే... ఇంట్లో బోలెడంత పనివుంది..." అనేసి చెప్పింది దమయంతి ఒక రోజున.

"ఏం? — ఎందుకు పిన్నీ ..." విషయమేమిటో వివరంగా తెల్సుకుందామనే అడిగింది సుశీల.

"రాధని చూచేటందుకు పెళ్ళిచూపులకు వస్తున్నారు— వాళ్ళకు టిఫినూ కాఫీ పన్లు చూచుకుంటూ వుంటే ... పై పై అవసరాలు నేను సర్దుకు పోతూంటాను ..." అనేసింది దమయంతి.

గంగాధరం రెండో కూతురు రాధ! పదహారేళ్ళయినా నిండని పసిదానికి అప్పుడే పెళ్ళా అన్పించింది సుశీలకు.

ఆ రోజు ఇంట్లో అందరిముఖాల్లోనూ సంతోషం వెల్లివిరిసింది. ఒక్క సుశీల మాత్రమే అన్యమనస్కంగా వుంది. అయినా పిన్ని పురమాయించే ప్రతిపనీ శ్రద్ధగా చేస్తూనే వుంది.

రాధ సంబరం చూస్తుంటే... సుశీల మనసు మాత్రం వెలితితో నిండి పోయింది.

సుశీలలో ఒకటే తీరని ఆలోచన?

తనూ ఆడపిల్లే! తన కంటే చిన్నవాళ్ళకూడా పెళ్ళిళ్ళు అయిపోతున్నయ్ — తనింకా ఇలాగే ఎండిని మోడులా రోజులు గడుపుతోంది.

తన బ్రతుకు గురించీ, భవిష్యత్ గురించీ సుఖ సంతో షాల గురించే ఆలోచించే వాళ్ళు గానీ — పట్టించుకునే వారు గానీ ఎవ్వరూ లేరు. అందరూ వున్న తన బ్రతుకు వంటరి దై ంది.

అనేక రకాల ఆలోచనలతో సుశీల హృదయం బరు వెక్కింది. ఆ వేదనతో మనస్సు కొట్టు మిట్టాడింది.

ఆ రోజు అన్నం కూడా తినాలన్పించ లేదు. ఆ రాత్రి కంటికి కునుకూ రాలేదు.

*　　*　　*　　*

అస్తవ్యస్తంగా మరో ఆరు నెలల కాలం గడిచి పోయింది.

షైపుకని బయలు దేరిన సుశీల తిరిగి ఇల్లు చేరుకో కదు ఒక రోజున.

రెండు రోజుల తర్వాత గంగాధరానికి ఒక వుత్తరం వచ్చింది.

అందులో ఇలా వుంది!

చిన్నాన్నా !

నా సాహసానికి మన్నించు!!

నేను ఇలాంటి నిర్ణయాని కొచ్చి నాదో వేదో నేను చూచుకున్నందుకు మీ రెవ్వరూ బాధపడరని నాకు తెల్సు — మీ సానుభూతి నాకు అక్కర్లేదు.

కన్నతండ్రి దరిద్రంతో తలమునక లైపోయి నా భవిష్యత్ గురించి ఆలోచించ గల శక్తి కోల్పోయాడు. అందుకు నోరు పెదపలేక పోయాను.

నా జీవితాని కొక వెలుగు మార్గం నువ్వయినా చూపిస్తావని ఆశపడ్డాను.

కానీ...... నన్నొక యంత్రంగా కేవలం మీ అవసరాలు తీర్చు కుందుకు మీ ఇంట్లో ఒక పనిమనిషిగా చూచుకున్నారు.

అందుకూ బాధ పడ్లేదు..

కానీ... ఏనాటికైనా నా గతేమిటాని వాపోయాను'

ఈ నా వెళ్ళిపోవటానికి కారణం... నాన్న దయనీయమైన పరిస్థితీ కాదు... నీచేతగాని తనం అంతకంటే కాదు.

నా బ్రతుక్కో—నీడ కావాలి! — నాకూ ఒక తోడు కావాలి!! — అ అవసరమే నన్ను ముందుకు నడిపించింది. నా కళ్ళు తెరిపించింది.

ఒక మహానుభావుడితో నాకు పరిచయమైంది. నన్ను పెళ్ళి చేసుకున్నాడు.

ఇంతకంటే జీవితంలో నాకు మరేమీ అక్కర్లేదు.

కానీ... నేనొక తప్పుచేశానని మాత్రం అనుకోవటం లేదు.

ఇలా జరగటానికి బాధ్యులెవరనేసి మీరెవరూ భుజాలు తడవుకోనక్కర్లేదు — తప్పు ఎవరిదనేసి మీరెవ్వరూ బాధ పడనూవద్దు.

శలవ్

సుశీల.

ఉత్తరం ఆసాంతం చదివిన గంగాధరంలో సంతోషం ఉప్పెనలా పొంగాల్సిందిపోయి.... ఇంట్లో వండి వార్చేటందుకు ఒక మనిషి దూరమైపోయిందేని వాపోయాడు.

[ 23-4-78 ఆకాశవాణి కడపకేంద్రం నుండి ప్రసారితమైంది ]

*PLEASE VISIT ONCE*

# HOTEL BALAJI

*FOR*

**PROMPT SERVING**
**DELICIOUS PREPARATIONS**
**HOMELY VEGETARIAN MEALS**
( Opposite to Dist. Court. )

PLACE FOR
CAR PARKING
AVAILABLE.

HIGH ROAD,
**CHITTOOR.**

FOR ALL VARIETIES OF
SUPERIOR QUALITY
FANCY ARTICLES
&
READY MADE GARMENTS
VISIT

# PRIYA

**( A Paradise of latest Fashions )**

11—8—36
**Old Taluk Kachery Road,**
**CHITTOOR - 517 001**

Phone : Factory. 2660
Res. 2993

**For Decorative Mosaic Flooring**
USE

# *RAJA MOSAIC TILES*

*Manufacturers :* **RAJA MOSAIC INDUSTRIES**
**E. I., Industrial Estate,**
**CHITTOOR** - 517 001
Office : 10-1-10, Gandhi Road,
**CHITTOOR.**